# పాతకుర్చీ

చాగంటి
సత్యవెంకటరత్నం



జరుగుతున్న తరంలోని వ్యక్తి నరసింహారావు. ఆ నరసింహారావుకో నాన్న. ఆయనిప్పుడు సజీవంగా లేడు. బ్రతికున్న రోజుల్లో ఆయన్ని జగన్నాథం, జగ్గూ అని పిలిచేవారు.

జగన్నాథంగారు తనహయాంలో ఓ 'కుర్చీ' కొన్నారు. ఆ గున డిప్యూటీ తాసీల్దారు గిరీలో ప్రవే

శించినపుడు ఇంటికి పెద్దలెవరేనా వస్తే కూర్చునేందుకు బాగుంటుందని ఆయన తన ముప్ఫైయవఏట డిప్యూటీ తాసీల్దారు పదవిలో ప్రవేశించాక అందుకున్న మొదటి నెల జీతంతో ఓ కుర్చీ కొన్నారు. ఆ కుర్చీని ఆయన నిరభ్యంతరంగా యాభైఏళ్ళు ఉపయోగించుకున్నారు. ఆ పన్నెండు రూపాయల కుర్చీచేత వందరూపాయలసేవ చేయించుకున్నారు.

ఆయనింటికి తాసీల్దారొచ్చినా, కలెక్టరొచ్చినా అదే కుర్చీలో కూర్చోబెట్టి గౌరవించేవారు జగన్నాథంగారు. ఆయన ఇంటికివచ్చే బంధువులందరూ ఆ కుర్చీలో కూర్చుని బయటికి కదలినవాళ్ళే. అయితే పెద్దవాళ్ళను మాత్రమే ఆ కుర్చీలో కూర్చోనిచ్చేవారు. చిన్నపిల్లలైతే ఎ... తగలేస్తారేమోనని ఆయన భయం. ఎవరైనా పిల్లలు మరీ మోజుపడితే ఓ అయిదు నిమిషాలు కూర్చోబెట్టి దింపేసేవారు. ఈ అయిదు నిమిషాలూ ఆయన ఆ కుంకలకి కాపలా.

జగన్నాథంగారితల్లి సుందరమ్మగారికి కొడుకుకన్నా ఆ కుర్చీఅంటే అభిమానం మెండు. ఆ కుర్చీమీద జగన్నాథం కనబరిచే ఆప్యాయతకి రెండు రెట్లు సుందరమ్మగారు చూపించేవారు. వాళ్ళింట్లో ఏవైనా వేడుకలు జరిగినప్పుడు పెద్దది కదా అని తల్లిని మధ్యగా ఆ కుర్చీ వేసి కూర్చుండబెట్టేవారు జగ్గుగారు. ఆ సుందరమ్మగారు చచ్చిపోయాక ఆవిడ వంతుకూడా తనే స్వీకరించి కుర్చీనిగూర్చి మరింతశ్రద్ధ కనపర్చేవారు. పెద్ద పండుగకి ప్రతి ఏటా ఇంటికి వెల్లవేయించకపోయినా కుర్చీకిమాత్రం స్వయంగా వార్నీషు వేసేవారు. ఆయన రిటైరయ్యాక వీధి నడవ కెదురుగా, గుమ్మానికి దగ్గరగా ఆ కుర్చీ వేసుకూర్చుని వీధిలో వచ్చేపోయేవారిని పలకరించేవారు ఠీవిగా. ఆయన తన ఆఫీసులోని "తిరిగే కుర్చీ"లో కూర్చున్నప్పుడు కలిగే దర్జాకన్నా ఇంటి దగ్గర 'తన కుర్చీ'లో కూచున్నప్పుడు ఎక్కువ దర్జా కలిగేది. దీనికాకారణం 'అది నా స్వంతం-నా కష్టార్జితం' అన్న మెప్పుదలేనేమో!

జగన్నాథంగారు చచ్చిపోయే సమయానికి ఆ కుర్చీకి కూడా వార్ధక్య మొచ్చేసింది కాబోలు. ఓ కాలు విరిగిపోయింది. దాన్ని తనే బాగు చేయాలనుకున్నారు. కాని ఇంతలోకే శాపం పెట్టినట్లుగా కుర్చీకి కాలు విరిగినట్లే ఆయన కుడి చెయ్యి, కుడికాలూకూడా పడిపోయి పక్షవాతంకూడా రావడం, ఓ వారం రోజులతర్వాత చచ్చిపోవడం జరిగాయి.

జగన్నాథంగారు చచ్చిపోతూ

కొడుకు నరసింహారావుకి ఆ కుర్చీని అప్పజెప్పారు. 'ఒరే నాయనా! ఆ కుర్చీకి కాలు వేయించు. ఏభైఏళ్లుగా మనకి అచ్చివచ్చింది' అని. అలా అనడంలో ఆయన ఉద్దేశం బహుశః 'తన కొడుకు చిన్నప్పటినుంచీ ఆ కుర్చీలో కూర్చోబట్టే వాడికా రీవి ఏర్పడిందని, వాడిరీవినిబట్టే అదృష్టం వరించి వాడు తనకన్నా ఒక మెట్టు పైకి—తాసీల్దారుగిరీకి – ఎగబ్రాకాడ న్నూ.

పన్నెండు రోజుల కర్మకాండ ముగిశాక నరసింహారావు చేసిన మొదటిపని కుర్చీకి కాలు వేయించడమే.

నరసింహారావుకి ఆ కుర్చీ అంటే ఓ విధమైన గౌరవభావం వుండేది. తనకన్నా ముందునుంచీ ఆ యింట్లో స్థానం సంపాదించుకున్న దన్న మెప్పుదలకూడా అందుకు కారణం అయివుండవచ్చు. నరసింహారావు కూడా తండ్రిలాగానే అభిప్రాయ పడ్డాడు. 'అకుర్చీలోచిన్నప్పటినుంచీ కూర్చోడంవల్లనే అతడిని అదృష్టం వరించిన'దని. ఆ వుద్దేశంతోనే తన కొడుకు జగన్నాధరావునికూడా చిన్నప్పటినుంచీ ఆ కుర్చీలోనే తన వళ్ళో కూర్చోబెట్టుకుని అన్నం తిని పించేవాడు. ఆ కుర్చీని గూర్చిన కథలల్లి చెప్పేవాడు. చిన్నజగ్గు పెద్ద వాడయ్యాడు. అయితేనేమి అత గాడు పుట్టిందీ, పెరిగిందీకూడా ఇర వయో శతాబ్దపు నాగరికయుగంలో. అతగాడికి అభ్యుదయ భావా లెక్కువ. తన తండ్రీ, తాత, తాత మ్మలయొక్క పురాతనమైన నాసి రకం భావాలని అసహ్యించుకొనే వాడు. కాని అతడు ఆ కుర్చీపట్ల తన హేయ భావాన్ని తండ్రి ముందర ఎన్నడూ వ్యక్తపరచలేదు. ఇందుకు కారణం ఆ కుర్చీపట్ల తండ్రి కున్న ప్రగాఢమైన అభిమానాన్ని చిన్నజగ్గు ఎరిగివుండటమే. ఆ కుర్చీని కించపరిస్తే, తన తండ్రి పెద్దజగ్గుని అవమానించినట్లే భావించి తన వీపు చీరేస్తాడు అన్న భయం చిన జగ్గుని ఆ కుర్చీని గూర్చిన స్వీయాభి ప్రాయాన్ని వెల్లడి చేయకుండా జాగ్రత్త పడేట్టు చేసింది.

మెల్లగా ఆ కుర్చీకి మరోముప్పై ఏళ్లు నిండాయి. నరసింహారావు కూడా అరవై నిండాయి. అతని కూడా పైలోకంనుంచి పిలుపు వచ్చింది. వెళ్ళిపోయాడు ఈ లోకం లోంచి శాశ్వతంగా. తన నాయ నమ్మ తరంనుంచీవుంటున్న ఆ కుర్చీని కొడుక్కి అప్పగించి.

ఇప్పుడిహ చిన్నజగ్గు తరం. నర సింహారావుతరం వెళ్ళిపోయింది.

చిన్నజగ్గు ఆ కుర్చీని మండు వాలో వేశాడు. దానిమీద తన తండ్రి పెదకర్మకని వచ్చిన బంధువుల తాలూకు పిల్లలు ఎక్కితగలేస్తున్నా

కూడా ఏమీ అనలేదు. అప్పటికే సగం పూడిపోయిన ఆ కుర్చీ వీపును పూర్తిగా వూడబెరికినాకూడా చిన జగ్గు తన తండ్రిలాగ, తాతలాగ చీదరించుకోలేదు, కోప్పడలేదు కూడా. దాన్నిగురించి పెద్దవాళ్లు తమ పిల్లల్ని కోప్పడుతుంటే చిరునవ్వునవ్వి వారించేవాడు. బంధువులుకూడా ఆశ్చర్యపోయారు. 'ఇదేమిటీ పిల్లాడు ఆ కుర్చీని నిర్లక్ష్యంగా చూస్తున్నాడు. ఆ కుర్చీ సంగతి ఇతగాడికి తెలీదా' అని?

పన్నెండో రోజు కర్మకాండ పూర్తయేసరికి ఆ కుర్చీవీపు, ఓకాలు కూడా విరగ్గొట్టారు పిల్లలంతా చేరి. చిన్న జగ్గు ఏం విచారించలేదుగాని బంధువులంతా నొచ్చుకున్నారు.

తమ యింటికి వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయిన ఓ వారంరోజుల తర్వాత ఓ తెల్లవారుఝామున చిన జగ్గు కుర్చీని ముక్కలుచేసి నీళ్ళపొయ్యిలో పెట్టించాడు, బంట్రోతు చేత.

ఇదిచూసిన అతడి సతీమణి బుగ్గలు నొక్కుకుని, 'అదేం పనండీ' అని కోప్పడిందికూడా. అప్పటికే ఆ 'పాతకుర్చీ' కాలి నుసైపోయింది. (పెద్దజగ్గు, నరసింహారావులు సజీవంగాలేరు, ఆ కుర్చీ తరపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడానికి. అందుకే నిర్భయంగా పాతకుర్చీ అనగలిగా) మామూలుగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు చినజగ్గు.

కొన్నాళ్ళకు నరసింహారావు మాసికం వచ్చింది. చినజగ్గు పెదలబలవంతంమీద తండ్రి మాసికం పెట్టాడు. అయితే కాకిమాత్రం వచ్చి ముద్దను ముట్టుకోలేదు. అందరూ ముక్కున వేలేసుకున్నారు. 'అపరాధం జరిగిపోయింది. కుర్చీ కాల్చేశారు నరసింహారావు ఆత్మశాంతించలేదంటూ' ఒకటేరొద, పెద్దలందరూ.

చినజగ్గు సతీమణికూడా భర్తపై విసుక్కుంది.

అతడి మేలుకోరే శ్రేయోభిలాషులందరూ భయపడ్డారు. 'ముందుముందు ఇంకేం అనర్థాలు జరుగుతయ్యో'నని.

చినజగ్గు మాత్రం తొణకలేదు. బెణకలేదు.

ఉన్నట్లుండి ఓ రోజున అతనికి తంతి వచ్చింది, 'నువ్వు కలెక్టరుగా సెలెక్టయినావురా అబ్బాయీ !' అని.

చినజగ్గు ఉద్యోగంలోకి ప్రవేశిస్తూనే ఓ డజను ఇనప కుర్చీలు కొన్నాడు.

□□□